ఏడాదంతా ఉచితంగా బియ్యం

- వాహనాల ద్వారా ఇంటి వద్దకే రేషన్
- జిల్లాలో 5,33 లక్షల మంది కార్డు దారులు
- ప్రతి నెలా 7616 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ



మొబైల్ వాహనం ద్వారా సరుకుల పంపిణీని పరిశీలిస్తున్న తహసీల్దార్ దోనీ ఆల్‌ఫ్రెడ్(ఫైల్)

కొలిమిగుండ్ల: రాష్ట్ర ప్రభుత్వం నూతన సంవత్సర కానుకగా ఏడాది పొడవునా పేదలకు ఉచితంగా రేషన్ బియ్యం ఇవ్వాలని నిర్ణయించింది. ఇప్పటి వరకు తెల్ల రేషన్ కార్డుదారులు కిలో రూపాయి చొప్పున చెల్లించి ఒక్కొక్కరు 5 కేజీలు చొప్పున బియ్యం పొందేవాళ్లు. ఇకపై ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా ఈఏడాది డిసెంబర్ వరకు ఉచితంగా బియ్యం ఇవ్వనుంది ప్రభుత్వం. ప్రతినెలా సరఫరా చేసే కందిపప్పు, చక్కెరకు మాత్రమే డబ్బులు తీసుకోనున్నారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వందల కుటుంబాలు ప్రతి నెలా రేషన్ బియ్యంపై ఆధారపడుతున్నారు. రూపాయి కూడా వారికి భారం కాకూడదనే ఉద్దేశంతో పూర్తిగా ఉచితంగా ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో కార్డు దారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 5,33 లక్షల కార్డులు

జిల్లాలో 5,33,496 మంది రేషన్ కార్డు దారులు ఉన్నారు. ప్రభుత్వం ప్రతి నెలా వీరందరికి 7616 మెట్రిక్ టన్నుల బియ్యం ఉచితంగా అందించనుంది.కార్డుదారులకు నాణ్యమైన బియ్యం అందించాలనే మంచి ఆశయంతో కోట్ల రూపాయలు ఖర్చు చేసిన బియ్యాన్ని పేదలకు పంపిణీ చేస్తుంది ప్రభుత్వం.

ఇంటి వద్దకే సరుకులు

దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా పంపిణీ వ్యవస్థను ప్రజల వద్దకు చేర్చాలని వినూత్నంగా చర్యలు చేపట్టారు. పేదలు ఇబ్బందులు పడకూడదని 2021 ఫిబ్రవరిలో మొబైల్ వాహనాలు(ఎండీయూ) తీసుకొచ్చారు. అధికారులు జిల్లాకు 351 మొబైల్ వాహనాలను కేటాయించారు. పల్లెలు, పట్టణాల్లోని చిన్న వీధుల్లో సైతం వెళ్లెలా వాహనాలను తయారు చేశారు. నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ యువతకు మొబైల్ వాహనాలు మంజూరు చేశారు. ఆపరేటర్లకు నెలకు రూ.18 వేలు చొప్పున అందజేస్తున్నారు. ప్రతి నెలా మొబైల్ వాహనాల ద్వారా ఇంటి వద్దకే వెళ్లి బియ్యం అందించేలా అధికార యంత్రాంగం చర్యలు చేపడుతుంది.

ప్రభుత్వ నిర్ణయం సంతోషకరం



ఈ సంవత్సరమంతా బియ్యం ప్రతి నెలా ఉచితంగా ఇవ్వాలని చెప్పడం చాలా మంచిది. ప్రభుత్వం కాయకష్టం చేసుకునే పేదలకు చేయూతనిస్తుంది. ప్రభుత్వ నిర్ణయం చాలా సంతోషకరం. రేషన్ బియ్యంపైనే చాలా మంది ఆధారపడ్డారు. – పుల్లయ్య,బితాదిపత్రి చెంచుగూడెం

ఇంటి వద్దకే బియ్యం పంపిణీ అభినందనీయం



ఇంటి వద్దనే బియ్యం పంపిణీ చేయడం అభినందనీయం. రూపాయి లేకుండా బియ్యం ఉచితంగా ఇవ్వడంతో పాటు ఇళ్ల వద్దకే తీసుకొచ్చి ఇవ్వడం చాలా బాగుంది. గతంలో వేలిముద్రలు పడక క్యూలో నిరీక్షిస్తూ ఇబ్బంది పడేవాళ్లం. ప్రభుత్వ సాయం మరువం. – కుళ్లాయమ్మ,అంకిరెడ్డిపల్లె

ఇళ్ల వద్దకే అందేలా చర్యలు

కార్డుదారులకు ఉచితంగా బియ్యం ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. గతంలో లబ్ధిదారులు ఒక్క రూపాయి చెల్లించే వాళ్లు. కార్డుదారుల ఇళ్ల వద్దకే మొబైల్ వాహనాల ద్వారా అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. మిగిలిన సరుకులకు డబ్బులు చెల్లించాల్సి ఉంది. – ఆచార్యులు, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి

క్లుప్తంగా

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసుల పంపిణీ



ప్లేట్లు, గ్లాసులు అందజేస్తున్న దృశ్యం

డోన్ టౌన్: పట్టణంలోని బీసీ బాలుర హాస్టల్ విద్యార్థులకు ఎల్ఐసీ డెవలప్‌మెంట్ అధికారుల బృందం సభ్యులు ప్లేట్లు గ్లాసులు పంపిణీ చేశారు. ఎల్ఐసీ అభివృద్ధి అధికారుల సంఘం వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకుని గురువారం స్థానిక కార్యాలయంలో వ్యవస్థాపకుడు కెల్‌విట్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డెవలప్‌మెంట్ అధికారులు రాజశేఖర్, వేణుగోపాల్ రెడ్డి, ప్రకాష్, భగవంతప్ప, సుబ్బారావు, ఎం రాజశేఖర్, నరహరి, రాజమోహన్, సుబ్రహ్మణ్యం,కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పద్య పఠనంలో విద్యార్థిని ప్రతిభ

కోవెలకుంట్ల: యోగి వేమన జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన పద్య పఠనం పోటీల్లో స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని సూర్యధరణి ప్రతిభ చాటినట్లు హెచ్‌ఎం అరుణకుమారి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు రెడ్డి జనసంఘ ఆధ్వర్యంలోఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి పద్య పఠనంలో సత్తా చాటి మొదటి స్థానంలో నిలిచిందన్నారు. మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి చేతుల మీదుగా రూ. 10 వేలు నగదు, ప్రశంసాపత్రం అందుకుందన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

నిత్యావసర సరుకులు పంపిణీ



సరుకులు అందజేస్తున్న రాజ్‌కుమార్

కొలిమిగుండ్ల: కొలిమిగుండ్లలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం క్షయ రోగులకు మెడికల్ ఆఫీసర్ రాజ్‌కుమార్ నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఎర్రబోతుల ఉదయ్‌భాస్కర్‌రెడ్డి 30 మంది టీబీ రోగులను దత్తత తీసుకున్నారన్నారు. వీరికి ఆరు నెలల పాటు బలవర్ధకమైన ఆహారం తీసుకునేందుకు సరుకులను అందించారన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ పరమేశ్వరరెడ్డి, సూపర్‌వైజర్ సుదర్శన్‌రెడ్డి, పీహెచ్‌ఎన్ చెన్నమ్మ, సూపర్‌వైజర్ మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

రుణ సమాధాన్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

బేతంచెర్ల: రుణ సమాధాన్ పథకాన్ని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ నంద్యాల రీజనల్ ప్రతినిధులు శ్రీనివాసులు, చంద్ర సేనుడు తెలిపారు. గురువారం స్థానిక ఎస్‌బీఐ మేనేజర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో చిన్న మొత్తం బకాయిల రాజీ పరిష్కారానికి అమలు చేస్తున్న రుణ సమాధాన్ పథకంపై ఖాతాదారులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రూ.20 లక్షలలోపు రుణబకాయిలు ఉన్న వారు మార్చి 31లోగా ఒకే ఒక్కసారి చెల్లించే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ మేరకు రూ. 22వేలు అప్పున్న వెంకటరమణ రూ.14 వేలు, రూ.56 వేలు బకాయి ఉన్న ఆర్. వెంకటేశ్వర్లు రూ. 30 వేలు చెల్లించారు. కార్యక్రమంలో ఫీల్డ్‌ఆఫీసర్లు ఉదయ్, భాస్కర్ పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

బేతంచెర్ల: మండల పరిధిలోని గోర్లగుట్ట గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని దాతల సహకారంతో గురువారం ముగిశాయి. ఆయా ప్రాంతాల నుంచి 20 జట్లు పాల్గొనగా హోరాహోరీగా సాగిన పోరులో గోర్లగుట్ట చార్లెస్ టీమ్ ప్రథమ బహుమతి, ఆవేంజర్స్ టీమ్ ద్వితీయ బహుమతిని కైవ సం చేసుకున్నాయి. విజేత జట్లకు రూ. 5వేలు, రూ.10వేలు చొప్పున బహుమతులను గ్రామ స్తులు చలపతి రెడ్డి, బొల్లవరం వెంకటేశ్వర్‌రెడ్డి,బాల వెంకట రెడ్డి చేతుల మీదుగా అందజేశారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ

కొలిమిగుండ్ల: అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎంపీడీఓ సుబ్బరాజు సూచించారు. గురువారం బెలుం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఉద్యోగులు సమయ పాలనకు వస్తున్నారా లేదా అని ఆరా తీశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూడాలని, నిర్లక్ష్యం వహించరాదని ఎంపీడీఓ హెచ్చరించారు. అదే విధంగా కమ్మవారిపల్లె, కోటపాడులో మొబైల్ ఆధార్ సెంటర్లను పరిశీలించారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదానం



అన్నం వడ్డిస్తున్న దృశ్యం

డోన్ టౌన్: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో స్ఫూర్తి సేవా సంస్థ సభ్యులు దాతల ఆర్థిక సాయంతో గురువారం అన్నదానం చేశారు. కర్నూలుకు చెందిన బాబా భక్తులు కృష్ణారెడ్డి, దేవి దంపతుల కుమారుడు సాయి వెంకటేశ్వరరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని వారి ఆర్థిక సాయంతో అన్నదానం చేశారు. రోగులు, పేదలకు వైద్యులు మాధవి,అపర్ణ భోజనం వడ్డించారు. కార్యక్రమంలో స్ఫూర్తి సభ్యులు మధు, హుమాయున్, మోగ, జగదీష్, వసంత, కిషోర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమానికి వృద్ధురాలు

డోన్ టౌన్: మండలంలోని ఉంగరానిగుండ్లకు చెందిన వృద్ధురాలు సుంకులమ్మను కూతురు నాగలక్ష్మి పట్టణంలోని హోసన్నా వృద్ధాశ్రమంలో చేర్పించింది. భర్త చనిపోవడం, ఒక్క కుమారుడు ఎనిమిదేళ్ల క్రితమే మృతి చెందడంతో ఉన్న ముగ్గురు కూతుళ్లలో భర్తలేని నాగలక్ష్మికి భారం కావడం ఇష్టంలేని వృద్ధురాలు గ్రామస్తుల సాయంతో ఆశ్రమ నిర్వాహకుడు జాన్ ప్రభాకర్‌కు సమస్యను వివరించడంతో ఆయన చేరదీశారు.

నాడు-నేడు పనులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి



సంగపట్నం పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న ఎస్‌ఎస్‌ఏ డీఈఈ ఈశ్వరయ్య

అవుకు: ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దేందుకు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మనబడి నాడు-నేడు పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని నంద్యాల జిల్లా సర్వశిక్షాభియాన్ డీఈఈ ఎం.ఈశ్వరయ్య పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని సంగపట్నం గ్రామంలో జెడ్పీ హెచ్‌ఎస్ పాఠశాలలో జరుగుతున్న అదనపు తరగతి గదులు, అవుకు జూనియర్ కాలేజీలో టాయిలెట్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ అవుకు మండలంలో మనబడి నాడు-నేడు ఫేస్-2 కింద 27 పాఠశాలలు ఎంపిక అయ్యాయన్నారు. పనులను వీలైనంత త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ పాఠశాలకు రెండు అదనపు తరగతి గదులు మంజూరయ్యాయని, వాటి నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్‌ఏ ఏఈ మధార్, ఎంఈఓ శ్రీధర్ రావు, హెచ్‌ఎం ఇసాక్, ఇంజనీర్ అసిస్టెంట్ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న క్రాంతికుమార్

డోన్ రూరల్ /టౌన్: ప్రయాణంలో రోడ్డు నిబంధనలు పాటించాలని, ద్విచక్రవాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎంవీఐ క్రాంతికుమార్ సూచించారు. 34వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలలో భాగంగా మండల పరిధిలోని దొరపల్లి గ్రామంలో ఆ గ్రామంతోపాటు లక్ష్మంపల్లె, మల్లెంపల్లె ప్రజలకు రోడ్డు నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. రోడ్డు ప్రక్కన ఏర్పాటు చేసిన బోర్డులలో ఉన్న గుర్తులను డిజిటల్ స్క్రీన్‌పై డిస్‌ప్లే చేస్తూ అర్థాన్ని విశదీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, మద్యం తాగి డ్రైవింగ్ చేయొద్దని సూచించారు. డ్రైవింగ్‌కు ముందు కుటుంబ సభ్యులను గుర్తు చేసుకోవాలని, ఏకాగ్రత కోల్పోకూడదన్నారు. వాహన చోదకులు తప్పనిసరిగా ఇన్సూరెన్స్, లైసెన్ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ గోపాల్, ఆర్‌టీఓ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రోన్ పైలెట్ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

బేతంచెర్ల: స్థానిక శేషారెడ్డి ఉన్నత పాఠశాల్లో ఏపీ స్కిల్ డెవలప్ మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత డ్రోన్ పైలెట్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని ట్రైనర్లు వెంకటేశ్వర్‌రెడ్డి, సుల్తాన్ గురువారం తెలిపారు. ఇంటర్, డిప్లొమా, డిగ్రీ విద్యార్హత కలిగి 18 ఏళ్ల పైబడిన వారు ఈ డ్రోన్ పైలెట్ శిక్షణకు అర్హులన్నారు. 45 రోజుల పాటు రోజుకు 3 గంటల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణ పూర్తయిన తరువాత ఉద్యోగ అవకాశం కల్పిస్తామని, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి



విద్యార్థినితో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీధర్ రావు

అవుకు: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఎంఈఓ శ్రీధర్ రావు సూచించారు. సంక్రాంతి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభం అయిన నేపథ్యంలో గురువారం మండల పరిధిలో అన్నవరం ఎంపీపీఎస్ స్కూల్‌ను ఎంఈఓ తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి విద్యాబోధనపై ఆరా తీశారు. అనంతరం సంగపట్నం ఎంపీపీఎస్, జెడ్పీ హెచ్‌ఎస్ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం నాణ్యతాప్రమాణాలతో కూడిన భోజనాన్ని అందించాలని సిబ్బందికి సూచించారు. ఆయా కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఇసాక్, భాస్కర్, శివకర్ణ, ఉపాధ్యాయులు నాగూర్ ప్రసాద్, సీఆర్‌పీ రామ్మోహన్ పాల్గొన్నారు.

వివక్ష చూపించరాదు



సంతకాల సేకరణ కార్యక్రమంలో తహసీల్దార్ రామకృష్ణ

బనగానపల్లెరూరల్: ఆడపిల్లల పట్ల వివక్షత చూపించరాదని తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు. జాతీయ బాలికల వారోత్సవాల సందర్భంగా గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ ఆధ్వర్యంలో చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమంలో తహసీల్దార్ పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం బాలికల నిష్పత్తి రోజురోజుకు తగ్గిపోతుందని, దీనికి కారణం లింగవివక్షనే కారణమన్నారు. మగపిల్లలతో సమానంగా ఆడ పిల్లలను అన్ని విధాలుగా ప్రోత్సహించాలన్నారు. లింగనిర్ధారణ పరీక్షలు, బాల్య వివాహాలు చట్టవిరుద్ధనే విషయాన్ని ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల మాజీ కో ఆప్షన్ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు బషీర్‌అహమ్మద్ సూపర్‌వైజర్లు సుగుణమ్మ, సాలమ్మ, చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

22న ఆలయాల పునర్నిర్మాణానికి భూమి పూజ

బేతంచెర్ల: పట్టణంలోని గౌరిపేటలో వెలసిన చెన్న కేశవ, ఆంజనేయ, వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో వినాయక, వేణుగోపాల స్వామి, మాధవ స్వామి, ఉత్తర ద్వారంతో పాటు కాలక్షేప మండప నిర్మాణానికి ఈనెల 22న భూమి పూజ నిర్వహిస్తున్నట్లు ఈఓ మద్దిలేటి గురువారం తెలిపారు. రూ.1.50 కోట్లతో నిర్మించే ఆలయాల పునర్నిర్మాణ భూమి పూజ కార్యక్రమానికి ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి హాజరవుతారని వారు తెలిపారు.

వానరానికి అంత్యక్రియలు

బనగానపల్లెరూరల్: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గురువారం విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన వానరం మృతదేహానికి స్థానికులు అంత్యక్రియలు నిర్వహించారు. మానుషుల మాదిరిగానే వానర మృతదేహానికి స్నానం చేసి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎస్సార్‌బీసీ కాలువ సమీపంలో ఖననం చేశారు. కార్యక్రమంలో సుబ్బారెడ్డి, ఆచారి, శివనాగయ్య, హుస్సేని తదితరులు పాల్గొన్నారు.

యోగి వేమనకు నివాళి



వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

బేతంచెర్ల: మండల పరిధిలోని గోర్లగుట్ట ప్రాథమికోన్నత పాఠశాలలో యోగి వేమన జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్ర పటానికి ఉపాధ్యాయులు పూలమాలవేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం శివ కుమారస్వామి మాట్లాడుతూ వేమన పద్యాలు నేటి నవ్య సమాజానికి మార్గదర్శకమని, మన జీవితాన్ని మహోన్నతంగా మలచగల శక్తి వేమన పద్యాలకు ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ రామసుబ్బయ్య, ఉపాధ్యాయులు వరలక్ష్మి, షఫీవుల్లా, కార్తీక పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



బాధితురాలికి నగదు అందజేస్తున్న దృశ్యం

డోన్ టౌన్: పట్టణంలోని చిగురమానుపేటకు చెందిన అహరోన్ మరణించగా ఆయన అంత్యక్రియలకు డోన్ క్రిస్టియన్ జేఏసీ ఆర్థిక సాయం చేసింది. మృతుడి కుటుంబ సభ్యుల ఇబ్బందిని తెలుసుకున్న జేఏసీ నాయకులు శవపేటిక కొనుగోలు నిమిత్తం నగదు అందజేశారు. జేఏసీసీ అధ్యక్షుడు ఆదాం, సభ్యులు ప్రవీణ్,యిర్మియ, గౌరవ సలహాదారులు నిత్యానందం, శాంసన్, రాజు తదితరులు మృతుని కుటుంబ సభ్యుల కొరకు ప్రార్థనలు చేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ

ప్యాపిలి: అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయడమే ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీటీసీ సభ్యుడు బోరెడ్డి శ్రీరామిరెడ్డి, ఎంపీపీ గోకుల్‌లక్ష్మి, మండల జేఏసీ కన్వీనర్ బొర్రా మల్లికార్జునరెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఎన్ రంగాపురం గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ తదితరులు ప్రజలకు సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పించారు. అదేవిధంగా ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలతో లబ్ధి చేకూరాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం అన్నారు. అర్హత ఉన్నప్పటికీ ప్రభుత్వ పథకాలు అందని వారు ఉంటే స్థానిక సచివాలయాల్లో సంప్రదించాలన్నారు. సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్న వారికి ఎటువంటి సిఫారసు లేకుండా నేరుగా ప్రభుత్వ పథకాలు అందుతాయని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాసులు, ఈఓఆర్డీ బాలకృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు ముమ్మరం చేయండి



మాట్లాడుతున్న భాస్కర్ నాయుడు

బేతంచెర్ల: గ్రామాల్లో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పనులను ముమ్మరం చేయాలని జిల్లా ఉపాధి హామీ మానిటరింగ్ అధికారి భాస్కర్ నాయుడు తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ వెంగన్న, ఏపీడీ శ్రీవిద్య, ఏపీఓ శేషన్న ఆధ్వర్యంలో టెక్నికల్ అసిస్టెంట్స్, కంప్యూటర్ ఆపరేటర్స్‌తో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని గ్రామాల్లో లక్ష్యం మేరకు కూలీలు పనులకు హాజరేయ్యేలా చూడాలన్నారు. జాబ్ కార్డుకు ఆధార్ కార్డు అనుసంధానం అయ్యేలా చూసి, ఆధార్ బేస్డ్‌పై వేతనాలు చెల్లింపులు జరిగేలా చూడాలన్నారు. అనంతరం సిబ్బంది పనితీరు సమీక్ష నిర్వహించారు.

సీఎంను కలిసిన చల్లా కుటుంబ సభ్యులు



ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న చల్లా కుటుంబ సభ్యులు

అవుకు: విజయవాడ తాడెపల్లెలోని సీఎం క్యాంప్ ఆఫీస్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని గురువారం సాయంత్రం చల్లా కుటుంబ సభ్యులు కలిశారు. దివంగతనేత చల్లా రామకృష్ణా రెడ్డి సతీమణి చల్లా శ్రీదేవి, పెద్ద కుమారుడు చల్లా విగ్నేశ్వర్ రెడ్డి, చిన్న కూతురు చల్లా బృందా రెడ్డి, సోదరులు చల్లా సూర్యప్రకాశ్ రెడ్డి, చల్లా రాజశేఖర్ రెడ్డి, చల్లా విజయభాస్కర్ రెడ్డి, చల్లా అమర్‌నాథ్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

జగనన్న గృహ నిర్మాణానికి రూ. 5లక్షలు ఇవ్వాలి

డోన్ రూరల్ : జగనన్న కాలనీలలో ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు రూ. 5 లక్షలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు రాధాకృష్ణ, మండల కార్యదర్శి పులిశేఖర్, పట్టణ కార్యదర్శి నారాయణలు డిమాండ్ చేశారు. స్థానిక నక్కిరామన్న భవనంలో గురువారం సీపీఐ పోరుబాటపోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి మంజూరు చేస్తున్న మొత్తం సరిపోదన్నారు.

బేతంచెర్ల: జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులకు పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ కోరారు. గురువారం పట్టణంలోని సీపీఐ కార్యాలయం ఆవరణలో మండల సహాయ కార్యదర్శి నాగరాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్ ఆధ్వర్యంలో జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనపై ఫిబ్రవరి 22 వరకు చేపట్టే సీపీఐ పోరుబాట పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వెంకటేష్, మధు, ఎల్లక్రిష్ణ, మధు, ప్రదీప్, విజయ్ పాల్గొన్నారు.

జగనన్న గృహాల లబ్ధిదారులను ఆదుకోవాలి

బనగానపల్లెరూరల్: జగనన్న గృహ నిర్మాణలకు లబ్ధిదారులకు అందజేస్తున్న మొత్తాన్ని ప్రభుత్వం పెంచి పేదలను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కాలింగ్ రాముడు కోరారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో పలు ప్రజా సంఘాల నాయకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కాలింగ్ రాముడు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం ఒక్కోక్క గృహ నిర్మాణానికి సంబంధించి లబ్ధిదారులకు రూ.1.80లక్షల మాత్రమే ఇవ్వడం జరుగుతుందన్నారు. అయితే పెరిగిన కూలీల ధరల కారణంగా ఈ మొత్తం సరిపోవడం లేదని, ఒక్కోక్క గృహ నిర్మాణానికి రూ.5లక్షల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇందు కోసం ఈ నెల 30వ తేది వరకు సీపీఐ ఆధ్వర్యంలో జగనన్న కాలనీలను సందర్శించి నిధులను పెంచేందుకు సంతకాల సేకరణ చేపట్టి ప్రభుత్వానికి అందజేయ నున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయుసీ నాయకులు బాలకృష్ణ,ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్దమునెయ్య, సుబ్బయ్య,వెంకటస్వామి.సీపీఐ నాయకులు ఖాదర్ బాషా.రాముడు తదితరులు పాల్గొన్నారు.

బస్సు యాత్రను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యప్రతాప్

డోన్ రూరల్ : ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, వెనుకబడిన రాయలసీమకు జిల్లాలకు ప్రేత్యక ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని ఈనె21న డోన్ పట్టణంలో చేపట్టనున్న బస్సుయాత్రలో విద్యార్థులు, యువకులు, రాజకీయ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని అఖిల పక్ష రాజకీయ విద్యార్థి యువజన సంఘాల నాయకులు పిలుపు నిచ్చారు. స్థానిక నక్కిరామన్న భవనంలో గురువారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అఖిల పక్ష రాజకీయ విద్యార్థి యువజన సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా వెనుకబడి ఉందని, లోటును భర్తీ చేయడానికి ప్రత్యేక హోదా, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీ జిల్లాలలకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని ఉమ్మడి రాష్ట్ర విభజన సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పార్లమెంట్ సాక్షి చెప్పిందని, బీజేపీ కూడా మద్దతు పలికిందన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కనీసం ప్రత్యేక హోదాపై మాట్లాడకపోవడం విచారకరమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి మద్దిలేటి, ఏఐటీయూసీ అధ్యక్షుడు లక్ష్మినారాయణ, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి నారాయణ, సీపీఐ మండల కార్యదర్శి పులిశేఖర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాక కార్యదర్శి సూర్యప్రతాప్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి రానత్ తదితరులు పాల్గొన్నారు.

శనగల బసవన్నకు పరోక్షసేవ

శ్రీశైలంటెంపుల్: స్వామిఅమ్మవార్ల ఆలయ ప్రాంగణంలో శనగన బసవన్నగా పేరుపొందిన నందీశ్వరుడికి గురువారం సాయంత్రం త్రయోదశి సందర్భంగా పరోక్షసేవను ఈఓ ఎస్ లవన్న, అర్చకులు నిర్వహించారు. ఇందులో భాగంగా నందీశ్వరస్వామికి పంచామృతాలతో అభిషేకాధి అర్చనలను నిర్వహించారు. శనగల బసవన్నకు శాస్త్రోక్తంగా విశేష అన్నాభిషేకాలను నిర్వహించారు.

దత్తాత్రేయ స్వామికి విశేష పూజలు

లోకకల్యాణం కోసం శ్రీశైలదేవస్థానం గురువారం ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి విశేషపూజలను నిర్వహించింది. అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.